# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు






ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 349 పేజిలు : 04 వెల రూ. 2 శనివారం 01 - 08 - 2026


## అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లలో ఈవీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- నైపుణ్యాభివృద్ధిశక్తి కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశం
- టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచన



**హైదరాబాద్ :**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ టామ్‌కామ్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాస్‌పోర్టు నుంచి విదేశీ కంపెనీల్లో ఉద్యోగాల వరకు టామ్‌కామ్ బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవెలియన్‌లో స్కిల్స్, క్యాపిటల్, నాలెడ్జ్ ట్రెయినింగ్ ఇనీషియేటివ్ శాఖ(శక్తి) కార్యక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు, ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. ఓ వైపు చదువుకుంటూనే, మరో వైపు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వారికి స్టైఫండ్ లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో చేయబోయే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకుంటారన్నారు. దేశీయంగానూ, విదేశాల్లోనూ నర్సుల సేవలకు భారీ డిమాండ్ ఉందని ముఖ్యమంత్రి గారు వివరించారు. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడంతో ఇంటికో నర్సు డిమాండ్ ఉందన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నర్సింగ్ కళాశాలలకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. యంగ్ ఇండియా - మిగతా 2 లో

## తెలంగాణలో ఎస్ఐఆర్ మరోసారి గడువు పొడిగింపు




- ఆగస్టు 10 వరకు ఇంటింటి పరిశీలనకు అవకాశం
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నెమ్మదిగా సాగుతున్న సర్వే
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77 శాతం ప్రక్రియ పూర్తి

**హైదరాబాద్ :**

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి పరిశీలన గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. వాస్తవానికి ఆగస్టు 3తో ముగియాల్సిన ఈ గడువును ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం సర్వే పూర్తయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే, హైదరాబాద్ (56.31 శాతం), రంగారెడ్డి (63.43 శాతం), మేడ్చల్-మల్కాజ్‌గిరి (61.37 శాతం) వంటి కీలక జిల్లాల్లో ఈ ప్రక్రియ మందకొడిగా - మిగతా 2 లో



## జెన్ జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా

- రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్
- ఉపాధ్యాయుల సమావేశంలో విద్యార్థులను రేవంత్ అవమానించారన్న కిషన్ రెడ్డి
- విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సరికాదని వ్యాఖ్య
- విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని హితవు

**హైదరాబాద్ :**

ఇటీవల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులపై - మిగతా 2 లో

## పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు



- రూ.4.51లక్షల కోట్ల ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి రూ.3.15 లక్షల కోట్లు కేటాయింపు
- ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36,441 కోట్లు

**ఢిల్లీ :**

దేశ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉద్దేశించిన పలు కీలక ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన దాదాపు రూ.4.51 లక్షల కోట్ల భారీ వ్యయంతో కూడిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు కేంద్ర మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. దేశంలోని రైతులకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించే పీఎం-కిసాన్ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు మరో ఐదేళ్ల పాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.3,15,614 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఈ కేంద్ర ప్రాయోజిత - మిగతా 2 లో

## రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్




- కొత్త రకం డీజిల్‌ను ఆవిష్కరించిన ఆర్మీ చీఫ్
- ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ వినూత్న తరహా డీజిల్ ఆవిష్కరణ
- మైనస్ 42 డిగ్రీల చలిలోనూ సమర్థంగా పనిచేసే ఇంధనం
- స్వదేశీ పరిజ్ఞానంతో సైన్యం, ఆయిల్ కంపెనీల సంయుక్త రూపకల్పన
- హిమాలయాల్లో సైనిక వాహనాల సమర సన్నద్ధత పెంపు
- ఆత్మనిర్భర్ భారత్ దిశగా రక్షణ రంగంలో కీలక ముందడుగు

**ఢిల్లీ :**

భారత సైన్యం సరిహద్దుల్లో తన సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసుకునే దిశగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అత్యంత శీతల, మంచు ప్రాంతాల్లో సైనిక వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'ఎక్స్‌ట్రీమ్ వెదర్ గ్రేడ్' డీజిల్‌ను (ఎక్స్‌డబ్ల్యూజీ) ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్ శుక్రవారం ఢిల్లీలో ప్రారంభించారు. సాధారణంగా డీజిల్ అత్యంత తక్కువ ఉష్ణోగ్రతల వద్ద గడ్డకట్టి వాహనాల ఫిల్టర్లను మూసివేస్తుంది. అయితే, ఈ నూతన ఎక్స్‌డబ్ల్యూజీ డీజిల్ మైనస్ 42 డిగ్రీల సెల్సియస్ వద్ద కూడా సమర్థంగా పనిచేస్తుంది. బీఎస్-ఎ× ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఈ ఇంధనాన్ని, ప్రస్తుత సైనిక వాహనాల్లో ఎటువంటి సాంకేతిక మార్పులు చేయకుండానే నేరుగా - మిగతా 2 లో

## పోటెత్తుతున్న గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక జారీ

- భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరుకున్న గోదావరి నీటి మట్టం
- నిండుకుండలా మారిన తెలంగాణలోని జలాశయాలు
- జలాశయాలకు వరద పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికారులు



**భద్రాచలం :**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. - మిగతా 2 లో

## నకిలీ నెంబర్ ప్లేట్ వాడితే వాహనం సీజ్ , క్రిమినల్ కేసు

- హైదరాబాద్ సిటీ పోలీసులు
- నెంబర్ ప్లేట్లు మార్చే వారిపై పోలీసుల ఉక్కుపాదం
- ప్రత్యేక తనిఖీల్లో ఆరుగురిపై కేసు నమోదు
- హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే వాడాలని సూచన




**హైదరాబాద్ :**

వాహన చలానాల నుంచి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లు మార్చినా, అంకెలు సరిగా కనిపించకుండా ట్యాంపరింగ్ చేసినా ఇక జైలు శిక్ష తప్పదు. నగరంలో నకిలీ నంబర్ ప్లేట్లతో - మిగతా 2 లో




## నేడు మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం



- పీఎంఓ అధికారిక ప్రకటన విడుదల
- ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- భోగాపురం నుంచి రూ.17,900 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న ప్రధాని
- విశాఖలో సెమీకండక్టర్ ప్లాంట్‌తో పాటు పలు విద్యుత్, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపన

**అమరావతి :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏపీలో సుమారు రూ.17,900 కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. - మిగతా 2 లో

## ఏపీ ఓటర్ల జాబితాలో భారీ మార్పులు 45 లక్షల ఓట్లు తొలగింపు

- ఏపీలో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ప్రత్యేక సవరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల ఓట్ల తొలగింపు
- శాశ్వతంగా వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓట్లను తొలగించినట్లు వెల్లడి
- పేర్ల నమోదు, అభ్యంతరాలకు ఆగస్టు 30 వరకు అవకాశం
- అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్న ఈసీ




**అమరావతి :**

ఏపీలో ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ అనంతరం దాదాపు 45 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగిస్తూ భారత ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను ఈ జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తొలగించిన ఓట్లలో శాశ్వతంగా చిరునామా మారిన లేదా అందుబాటులో లేని వారు 22.30 లక్షల మంది ఉన్నారు. మరణించిన వారివి 15.22 లక్షల ఓట్లు కాగా, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్న 7.37 లక్షల మంది ఓట్లను కూడా తొలగించారు. ఈ సవరణ ప్రక్రియను జూన్ 15 నుంచి జూలై 24 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 4,16,27,694 మంది ఓటర్లకు గాను 3.71 కోట్ల మంది (89.22%) నుంచి బూత్ లెవల్ అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## సైబర్ మోసాలకు చెక్.. బహుముఖ వ్యూహాలే పరిష్కారం

(హెచ్.ప్రతాప్)

భారత్ వేగంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతున్న తరుణంలో సైబర్ నేరాలు కూడా అంతే వేగంగా విస్తరిస్తున్నాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులు, డిజిటల్ సేవల వినియోగం పెరగడం ప్రజలకు సౌలభ్యం కల్పించినా, నేరగాళ్లకు కొత్త అవకాశాలను తెరిచింది. ప్రపంచంలో అత్యధిక సైబర్ మోసాలు నమోదవుతున్న దేశాల్లో భారత్ ముందంజలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న మోసాలు ప్రజల ఆర్థిక భద్రతతో పాటు చట్ట అమలు సంస్థలపై విశ్వాసాన్నీ దెబ్బతీస్తున్నాయి. డిజిటల్ అరెస్ట్ మోసాల్లో నేరస్థులు పోలీసు లేదా దర్యాప్తు సంస్థల అధికారులుగా నటిస్తూ వీడియో కాల్స్ చేస్తారు. మనీ లాండరింగ్, మాదకద్రవ్యాలు, పార్శిల్ మోసాలు వంటి కేసుల్లో పేరు ఉందని, అరెస్టు వారెంట్ సిద్ధంగా ఉందని బెదిరిస్తారు. ముందుగానే లీకైన వ్యక్తిగత సమాచారాన్ని చూపించి బాధితుల్లో నమ్మకం కలిగిస్తారు. గంటల తరబడి ఫోన్‌లో ఉంచి, విచారణ పేరిట డబ్బును 'భద్రతా ఖాతా'లో జమ చేయాలని ఒత్తిడి తెస్తారు. ముఖ్యంగా వృద్ధులు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు ఈ మోసాలకు ఎక్కువగా బలవుతున్నారు. 2022 నుంచి 2026 మే వరకు దేశంలో దాదాపు మూడు లక్షల డిజిటల్ అరెస్ట్ ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటి వల్ల రూ.4,000 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. పార్లమెంట్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, 2024లో సైబర్ మోసాల కారణంగా భారతీయులు రూ.22,845 కోట్లు కోల్పోయారు. అదే ఏడాది 22 లక్షల సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఈ గణాంకాలు సైబర్ నేరాలు ఇప్పుడు విడివిడిగా జరిగే ఘటనలు కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను సవాలు చేస్తున్న ముప్పుగా మారాయని స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న సమాచార సాంకేతిక చట్టం--2000 ప్రధానంగా ఎలక్ట్రానిక్ లావాదేవీలు, డిజిటల్ రికార్డులను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడింది. కృత్రిమ మేధస్సు ఆధారిత మోసాలు, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి ఆధునిక నేరాలను సమర్థంగా ఎదుర్కొనే ప్రత్యేక నిబంధనలు అందులో లేవు. ఈ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం సూచించినట్లుగా 'డిజిటల్ అరెస్ట్'ను ప్రత్యేక నేరంగా నిర్వచించి, కఠిన శిక్షలను అమలు చేసేలా చట్టాలను సవరించడం అత్యవసరం. అలాగే అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ సైబర్ నేరాలను ఎదుర్కొనే ప్రత్యేక దర్యాప్తు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. సైబర్ నేరాలను అరికట్టాలంటే చట్టపరమైన చర్యలతో పాటు సాంకేతిక పరిష్కారాలు కూడా కీలకం. కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థలతో అనుమానాస్పద లావాదేవీలు, నకిలీ వెబ్‌సైట్లు, మోసపూరిత ఖాతాలను తక్షణమే గుర్తించే సామర్థ్యాన్ని పెంచాలి. బ్యాంకులు, టెలికాం సంస్థలు, దర్యాప్తు సంస్థలు పరస్పరం సమాచారాన్ని వేగంగా పంచుకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అదే సమయంలో ప్రజల్లో సైబర్ అవగాహన పెంపు, వ్యక్తిగత సమాచార రక్షణ, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకపోవడం వంటి జాగ్రత్తలు కూడా అత్యంత అవసరం. సైబర్ మోసాలు ఇక వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన సవాలుగా మారాయి. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా చట్టాలను నవీకరించడం, కృత్రిమ మేధస్సును రక్షణ సాధనంగా వినియోగించడం, సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడం, ప్రజల్లో అప్రమత్తత పెంపొందించడం ద్వారా మాత్రమే ఈ ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చు. సైబర్ భద్రతను ప్రభుత్వ బాధ్యతగా మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యతగా భావించినప్పుడే డిజిటల్ భారతం మరింత సురక్షితంగా మారుతుంది.

## రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్

**మొదటిపేజీ తరువాయి -** వినియోగించవచ్చు. భారత సైన్యం, ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సమన్వయంతో కేవలం ఏడాది వ్యవధిలోనే దీనిని అభివృద్ధి చేయడం గమనార్హం. ఈ ఆవిష్కరణను ఆర్మీ చీఫ్ 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. ఇది సైనిక వాహనాల కదలికలను సులభతరం చేయడమే కాకుండా, సమర సన్నద్ధతను మరియు కార్యాచరణ విశ్వసనీయతను గణనీయంగా పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. శీతాకాలంలో వాహనాలను స్టార్ట్ చేసేందుకు గతంలో అనుసరించిన ప్రమాదకర పద్ధతులకు ఇది స్వస్తి పలుకుతుందని, తద్వారా సైనిక సిబ్బంది భద్రతతో పాటు మనోధైర్యం పెరుగుతుందని ఆయన వివరించారు. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో చేపట్టిన ఈ కృషి, భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక ఇంధనాల తయారీకి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు. కేవలం సైనిక అవసరాలకే కాకుండా, తీవ్రమైన చలి ఉండే ప్రాంతాల్లో పౌర రవాణా అవసరాలకు కూడా ఈ డీజిల్ ఎంతగానో దోహదపడనుంది. ఈ కార్యక్రమానికి ముందు, ఆర్మీ చీఫ్ తూర్పు సెక్టార్‌లోని సైనిక ఫార్మేషన్లను రెండు రోజుల పాటు సందర్శించి, అక్కడి భద్రతా సన్నద్ధతను మరియు వరద సహాయక చర్యలను సమీక్షించారు.

## నకిలీ నెంబర్ ప్లేట్ వాడితే వాహనం సీజ్, క్రిమినల్ కేసు

**మొదటిపేజీ తరువాయి -** రోడ్లపై తిరుగుతున్న వాహనదారులపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. గత వారం రోజులుగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా... ఫేక్ ప్లేట్లను వినియోగిస్తున్న ఆరుగురిపై ఏకంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్‌బజార్, మెహదీపట్నం, బహదూర్‌పురాలతో పాటు మేడిపల్లి, పెద్దపల్లి, కట్టంగూర్ ప్రాంతాల్లో ఈ కేసులు నమోదయ్యాయి. కొంతమంది నిఘా కెమెరాల నుంచి, ఈ-చలానాల నుంచి తప్పించుకోవడానికి నంబర్లను మార్చడం లేదా వేరే వాహనం నంబర్‌ను వాడుకోవడం లాంటి తీవ్ర నేరాలకు పాల్పడుతున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. పోలీసుల హెచ్చరికల ప్రకారం... ప్రభుత్వం అధికారికంగా ఆమోదించిన 'హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు' మాత్రమే వాహనాలకు ఉండాలి. నంబర్ ప్లేట్లపై ఏ విధమైన ఫ్యాన్సీ ఫాంట్లు, స్టిక్కర్లు, దేవుళ్ల బొమ్మలు లేదా నంబర్లను అస్పష్టంగా మార్చే ప్రయత్నాలు చేయకూడదు. నకిలీ ప్లేట్లతో దొరికితే కేవలం ఫైన్‌తో వదిలిపెట్టకుండా, వాహనం సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

## జెన్ జీ, ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానిస్తారా




**మొదటిపేజీ తరువాయి -** చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించారని మండిపడ్డారు. ఇది సరైన పద్ధతి కాదని... యువతను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారనే అక్కసుతోనే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలకు దిగారని ఆయన ఆరోపించారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని కిషన్ రెడ్డి చెప్పారు. విద్యార్థులను క్రిమినల్స్‌తో పోల్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. జెన్ జీ ఆకాంక్షలకు, భావాలకు వ్యతిరేకంగా పాలకులు వెళ్లడం సరికాదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి విద్యార్థులపై నిందలు వేయడం మాని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన విద్యా సంస్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ మరోసారి గడువు పొడిగింపు




**మొదటిపేజీ తరువాయి -** సాగుతుండటంతో గడువును పెంచాల్సి వచ్చింది. ఈ సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లను నిర్ధారించడం, నకిలీ ఓట్లను గుర్తించడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి పనులను చేపడుతున్నారు. ఓటర్ల జాబితా సవరణకు తొలుత జూలై 24ను తేది గడువుగా నిర్ణయించగా, దానిని ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా మరో వారం గడువు పెంచుతూ ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించారు.

# ఏపీ ఓటర్ల జాబితాలో భారీ మార్పులు




**మొదటిపేజీ తరువాయి -** మిగిలిన 44.89 లక్షల మంది ఓటర్లు వారి చిరునామాలో అందుబాటులో లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఫారాలు సమర్పించకపోవడం లేదా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల వారి వివరాలను సేకరించలేకపోయినట్లు సీఈఓ వివరించారు. అయితే, జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అలాంటి వారు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. ఇవాళ్టి నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అర్హులైన వారు నిర్దేశిత డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం-6ను సమర్పించి, తమ పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్న వారి పేరును వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే ఉంచుతారు. ప్రజల సౌలభ్యం కోసం తొలగించిన ఓటర్ల జాబితాను రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈఆర్ఓ/ఏఈఆర్ఓ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శనకు ఉంచారు. అలాగే, సీఈఓ, జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో కూడా ఈ జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు పరిష్కరించి, అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామని వివేక్ యాదవ్ తెలిపారు. ఈ భారీ ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, 46,397 మంది బీఎల్ఓలు సమన్వయంతో పనిచేశారని ఆయన అభినందించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నాయని, గతంలో 68,868 మంది బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 1,27,868కి పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## నేడు మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం

**మొదటిపేజీ తరువాయి -** విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం ప్రధాని షెడ్యూల్ లో కీలకంగా నిలవనుంది. మోదీ పర్యటనకు సంబంధించిన అధికారిక ప్రకటనను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) విడుదల చేసింది. ఈ పర్యటన ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక ప్రగతికి గణనీయమైన ఊపునిస్తుందని భావిస్తున్నారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం, ఉదయం 10:45 గంటలకు ప్రధాని మోదీ ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ ఆయనకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతం పలుకుతారు. ఉదయం 10:58 గంటలకు ప్రధాని టెర్మినల్ భవనాన్ని ప్రారంభించి, అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులతో కలిసి విమానాశ్రయంలోని సౌకర్యాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత, ప్రధాని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్-టాప్ వాహనంలో బహిరంగ సభా ప్రాంగణానికి బయలుదేరుతారు. మార్గమధ్యలో 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ 'ధింసా' నృత్యంతో ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:55 గంటల వరకు ప్రధాని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:10 గంటలకు కర్ణాటక పర్యటనకు పయనమవుతారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. దేశంలోనే అత్యంత వేగంగా పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల్లో ఒకటిగా ఇది నిలిచింది. నిర్దేశిత గడువు కంటే ఐదు నెలల ముందే నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఇప్పటికే ఈ విమానాశ్రయానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యంతో టెర్మినల్‌ను నిర్మించారు. భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని 4 కోట్ల మందికి పెంచేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. మొత్తం 2,703 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాజెక్టులో 2,203 ఎకరాల్లో విమానాశ్రయం, మిగిలిన ప్రాంతంలో ఏవియేషన్ హబ్, ఏవియేషన్ యూనివర్సిటీ, ఎడ్యుసిటీ, వాణిజ్య, నివాస సముదాయాలు ఏర్పాటు చేయనున్నారు.

## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే



**మొదటిపేజీ తరువాయి -** చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు ఎంతో అమూల్యమైనదని, కాలువల్లో పూడిక తీత, గట్ల లీకేజీల నివారణ వంటి తక్షణ చర్యల ద్వారా నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి సారించాలని పవన్ సూచించారు. రైతుల ఆందోళనను తగ్గించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల రైతు ప్రయోజనాల కోసం ఏలేరు ప్రాజెక్టు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు మంత్రి నిమ్మల రామానాయుడికి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు తానే స్వయంగా ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు మంత్రి వివరించారు. కాగా, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని మంత్రి నిమ్మల అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరితగతిన పూర్తి కోలుకుని, మళ్లీ ప్రజాసేవలో మునుపటి కంటే మరింత చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# పీఎం కిసాన్ పథకం మరో ఐదేళ్లు పొడిగింపు



**మొదటిపేజీ తరువాయి -** పథకం కింద అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6000 ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2000 చొప్పున మొత్తం జమ చేస్తున్నారు. 'పీఎం కిసాన్' పథకం ద్వారా ఇప్పటివరకు 23 విడతల్లో మొత్తం 4.47 లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ పథకం అమలుపై నీతి ఆయోగ్ జరిపిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. దాదాపు 92 శాతం మంది లబ్ధిదారులు ఈ నగదును నేరుగా వ్యవసాయ పెట్టుబడుల కోసమే వినియోగిస్తున్నారని, తద్వారా 85 శాతం మంది రైతుల వ్యవసాయ ఆదాయం మెరుగుపడటమే కాకుండా అప్పుల కోసం ఇతరులపై ఆధారపడటం కూడా తగ్గిందని నివేదిక స్పష్టం చేసింది. పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు రూ.5,070 కోట్లతో 'ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజన'కు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలాశయాలు, పారిశ్రామిక చెరువులపై సోలార్ ప్లాంట్ల నిర్మాణమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఉన్న 700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ సామర్థ్యాన్ని 5,000 మెగావాట్లకు పెంచనున్నారు. 10,000 మెగావాట్ల సామర్థ్యంతో ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2026-27 నుంచి 2030-31 వరకు ప్రాజెక్టులను అమలులోకి తీసుకురానుండగా, 2032-33 వరకు కేంద్రం ఆర్థిక సహకారం అందించనుంది. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల అధ్యయనానికి ఒక్కో ప్రాజెక్టుకు 50 లక్షల వరకు, అలాగే నిర్మాణ దశలో ప్రతి మెగావాట్‌కు కోటి చొప్పున కేంద్రం ఆర్థిక సహాయం చేయనుంది. ఈ పథకం ద్వారా ఏటా సుమారు కోటి టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. దాదాపు 16,000 నుంచి 17,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించడమే కాకుండా దేశీయ సోలార్, బ్యాటరీ తయారీ రంగానికి భారీ ఊతం లభించనుంది. సముద్ర వనరుల పరిశోధన, వినియోగం దిశగా చేపడుతున్న రూ.84,084 కోట్ల విలువైన 'సముద్ర మంథన్' ప్రాజెక్టును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి ఖేలో ఇండియా, జాతీయ క్రీడా ఫెడరేషన్ పథకానికి రూ.36, 441 కోట్లు మంజూరు చేశారు. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ట్విన్ ట్యూబ్ సొరంగాల నిర్మాణాలకు గాను రూ.9,779 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

## పోటెత్తుతున్న గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక జారీ



**మొదటిపేజీ తరువాయి -** ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం అధికారులు 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిప్రవాహం గంటగంటకూ పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, తెలంగాణలోని ప్రధాన జలాశయాలన్నీ వరద నీటితో నిండుకుండలా మారాయి. కడెం ప్రాజెక్టు నీటిమట్టం 698.02 అడుగులకు (పూర్తి స్థాయి 700 అడుగులు) చేరగా, 10,282 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదవుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి 70 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా, నీటిమట్టం 1069 అడుగుల వద్ద ఉంది. ఇక శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.30 మీటర్లకు చేరుకుంది. ఎల్లంపల్లిలోకి 1,32,785 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో, అంతే మొత్తంలో (1,32,785 క్యూసెక్కులు) నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 18,445 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయాల నీటిమట్టం వేగంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టుల వద్ద యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.

## అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లలో ఈవీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు



**మొదటిపేజీ తరువాయి -** స్కిల్ యూనివర్సిటీలో నూతన ఆవిష్కరణలకు అవసరమైనటువంటి రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. జర్మన్, జపనీస్, కొరియన్, చైనీస్, రష్యన్ తదితర భాషలు నేర్చుకునేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలన్నారు. ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పేందుకు స్థానికంగా ఆ భాషలో పట్టున్న వారితో పాటు ఆయా దేశాలకు చెందిన శిక్షకులను రప్పించాలని ఆయన సూచించారు. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చినట్లుగానే బ్లూ కాలర్ జాబ్‌లకు శిక్షణ పొందే వారందరికీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఏటీసీల్లో(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల)లో ఈవీ సర్వీసులకు సంబంధించిన కోర్సులు, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈవీల వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో వాటి సర్వీసింగ్ చేయగలిగిన వారు అవసరమన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారీగా పెరుగుతున్నందున డ్రోన్ టెక్నాలజీ కోర్సు ఉండాలని ఆయన సూచించారు.

# హైడ్రా నుంచి రంగనాథ్‌ను వెంటనే బదిలీ చేయండి

### హైకోర్టు తాజా ఉత్తర్వులు

### లోతుకుంట భూముల వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని ఆగ్రహం

### వివాదాస్పద స్థలంలోకి సిబ్బందితో వెళ్లడం చట్టవిరుద్ధమని స్పష్టం

### వ్యక్తుల ఆధిపత్యం పెరిగితే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని వ్యాఖ్య



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాలను ఉల్లంఘించినందుకు గాను, ఆయన్ను తక్షణమే ఆ పదవి నుంచి బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తాజాగా, రంగనాథ్ స్థానంలో మరొక అధికారిని నియమించాలని నేడు ఉత్తర్వులు జారీ చేసింది. లోతుకుంట భూముల వ్యవహారంలో హైడ్రాకు, శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ కేసులో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రంగనాథ్ స్పష్టంగా ఉల్లంఘించారని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. వివాదాస్పద స్థలంలోకి యంత్రాలు, సిబ్బందితో ప్రవేశించడం పూర్తిగా చట్టవిరుద్ధమని తేల్చిచెప్పింది. ఇదే కేసులో రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని గతంలోనే హైకోర్టు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. టాటా మోహన్ రావు కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఉటంకిస్తూ, దేశంలో చట్టబద్ధమైన పాలన మాత్రమే కొనసాగాలని స్పష్టం చేసింది. వ్యక్తుల ఆధిపత్యం పెరగడం ప్రజాస్వామ్యానికి 'మరణశాసనం' వంటిదని హైకోర్టు ఘాటుగా హెచ్చరించింది.


# “లోకా యుక్త” కు తప్పుడు సమాచారం ఇచ్చిన “జిల్లా కలెక్టర్”

కలెక్టర్ లనే తప్పుద్రోవ పట్టిస్తున్న “డిపివో చీకోటి మదన్ మోహన్”

ఆగస్టు 3న “లోకాయుక్త” లో బుగ్గారం కేసు విచారణ

జిల్లా కలెక్టర్ నివేదికలపై అభ్యంతరాలు తెలుపనున్న “చుక్క గంగారెడ్డి”

ఆరేండ్ల నుండి “లెక్కలు తేల్చని” పంచాయతీ అధికారులు




**బుగ్గారం / జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) జూలై 31 :** జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి “లోకాయుక్త న్యాయస్థానానికి”, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం అందజేశారని తెలంగాణ జనసమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులైన బుగ్గారం విడిసి వ్యవస్థాపక అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఆగస్ట్ 3న లోకాయుక్త న్యాయస్థానంలో బుగ్గారం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం కేసు విచారణ జరుగనుందని ఆయన తెలిపారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ అందజేసిన తప్పుడు నివేదికలపై ఆగస్ట్ 3న ఆయన అభ్యంతరాల నివేదికను లోకాయుక్త కు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి చీకోటి మదన్ మోహన్ జగిత్యాల జిల్లా కలెక్టర్ లనే తప్పుద్రోవ పట్టిస్తూ పలు సార్లు తప్పుడు సమాచారంతో కూడిన ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ లకు అందజేసినట్లు ఆయన ఆరోపించారు. ఒక జిల్లా మేజిస్ట్రేట్ అయి ఉండి కూడా డిపివో అందజేసిన తప్పుడు సమాచారం నివేదికలనే గుడ్డిగా నమ్మి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు, లోకాయుక్త లాంటి న్యాయస్థానాలకు సైతం ఇదే తప్పుడు సమాచారంతో కూడిన నివేదికలు పంపడం విడ్డూరంగా ఉందని చుక్క గంగారెడ్డి అభిప్రాయ పడ్డారు.జిల్లా పంచాయతీ కార్యాలయంలో పేరుకు పోయిన అవినీతి - అక్రమాల వల్లనే దోషులను చట్టపరమైన శిక్షల నుండి కాపాడేందుకు ఇలాంటి తప్పుడు నివేదికలు రూపొందిస్తున్నారని ఆయన సూచించారు. బుగ్గారం గ్రామ పంచాయతీ కి రికవరీ అయిన లక్షలాది రూపాయల చలాన్ ల డబ్బులను కూడా జిల్లా ఉన్నతాధికారులు లెక్క చూపకుండా, కప్పి పుచ్చడం జరిగిందన్నారు. ఇందులో దాగి ఉన్న అంతర్యం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. 2024 సెప్టెంబర్ 11న ఒకటి అలాగే 2025 జనవరి 6న మరొకటి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జారీ అయిన ఆర్డర్ లనున డిపిఒ అమలు చేయకపోవడం శోచనీయం అన్నారు. వీటిని డిపివో పూర్తిగా కప్పి పుచ్చి వాటిని తుంగలో తొక్కడం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండిటితో పాటు ఇంకా..... ఇంకా అనేక ఆర్డర్ లను కూడా గౌరవ లోకాయుక్త న్యాయస్థానానికి గానీ, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు గానీ పంపించిన నివేదికల్లో పేర్కొనకపోవడం డిపివో అవినీతికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. ఇదొక్క కేసులోనే కాకుండా జిల్లాలోని ఇంకా అనేక కేసుల్లో కూడా జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం భారీ మొత్తంలో అవినీతి - అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. డిపివో చీకోటి మదన్ మోహన్ జగిత్యాల జిల్లా ప్రజలకు, ప్రభుత్వాలకు, బాధితులకు, నిరుపేదలకు తీరని అన్యాయం చేస్తూ, నష్టాలు - కష్టాలు కూడా కలుగజేస్తున్నట్లు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. బుగ్గారం తాజా మాజీ సర్పంచ్ మూల సుమలత సస్పెన్షన్ పై గౌరవ హై కోర్టు 2024 జనవరి 24న ఇచ్చిన స్టే - ఆర్డర్ ను ఒకే ఒక్క రోజులో అమలు చేయడం, గౌరవ లోకాయుక్త న్యాయస్థానం 2024 డిసెంబర్ 6న ఇచ్చిన తీర్పును ఏడాదిన్నర కాలం దాటిపోయినా అమలు చేయక పోవడం ఇందుకు నిదర్శనంగా పేర్కోవచ్చునని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ జారీ చేసిన సుమారు 20కి పైగా తన పిర్యాదుల ఆర్డర్లకు సైతం డిపివో కార్యాలయం నుండి ఎలాంటి సమాధానం లేదని ఆయన మండి పడ్డారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి డిపివో కార్యాలయంలో జరుగుతున్న అవినీతి - అక్రమాలను వెలికి తీసి ప్రజలకు, ప్రభుత్వాలకు, నిరుపేదలకు, పంచాయతీ రాజ్ విభాగానికి తగు న్యాయం చేయాలని, పారదర్శకమైన పరిపాలన అందజేయాలని చుక్క గంగారెడ్డి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కోరారు.

# గొల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కేజీబీవీలో ఆషాఢ గోరింటాకు వేడుకలు



**గొల్లపల్లి జులై 31 ప్రజా మంటలు :** గొల్లపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గొల్లపల్లి మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గోరింటాకు సంబరాలు అంబరాన్నంటేలా శుక్రవారం జరిగాయి. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు ఒకరికొకరు రకరకాల ఆకర్షణీయమైన డిజైన్లలో గోరింటాకు పెట్టుకుంటూ సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా లీడ్ ఇండియా రాష్ట్ర సమన్వయకర్త తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, పండుగలకు ఉన్న విశిష్టతను నేటి తరం విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆషాఢ మాసంలో గోరింటాకు ధరించడం కేవలం ఒక ఆచారం మాత్రమే కాదని, మారుతున్న రుతుపవనాల కాలంలో శరీరానికి చలువ చేసే అద్భుతమైన ఆరోగ్య సూత్రం కూడా దాని వెనుక దాగి ఉందని పేర్కొన్నారు.లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మెకుమార్ మాట్లాడుతూ.. సమాజ సేవే ధ్యేయంగా పనిచేసే లయన్స్ క్లబ్, మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవడంలోనూ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారిలో ఆనందాన్ని నింపేందుకు ఇటువంటి సంబరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మ మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా కేజీబీవీ విద్యార్థినులకు చదువుతో పాటు మన ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కేజీబీవీ బాలికల కోసం ప్రత్యేకంగా ప్రేరణనిచ్చే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి సట్ట సురేష్, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు జలజ, జ్యోతిరాణి, స్రవంతి, అనూష, సుస్మిత, శ్యామల,గంగ జమున, పాలొగొన్నారు.

# భారీ వర్షానికి పాలంలో ఇసుక దిమ్మెలు

ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆవేదన





**ధర్మపురి / జగిత్యాల జిల్లా ప్రతినిధి, (ప్రజా మంటలు) జూలై 31 :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన జక్కుల భూమేష్ రైతు యొక్క పొలం భారీ వర్షాల వరదలకు మొత్తం కొట్టుకుపోయింది. నాటువేసి 15 రోజులు అవుతుంది. వరదలతో ఇసుక తెప్పలు పెట్టింది. దాదాపు గా ఒక లక్షరుపాయల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వ పరంగా ఆదుకొని పంట నష్ట పరిహారం ఇవ్వాలని రైతు భూమేష్ తన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## శాంతినగర్‌లో శ్రీ సుదర్శన గోశాల ఘనంగా ప్రారంభోత్సవం

గోపూజలు, భజనలు, ఆధ్యాత్మిక వాతావరణం



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, (ప్రజా మంటలు) జూలై 31 :** జగిత్యాల పట్టణంలోని 9వ వార్డు శాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సుదర్శన గోశాలను శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. భక్తుల భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు హాజరై ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగన్నాధం చక్రపాణి ఆచార్య (భరద్వాజస) ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ గోపూజను వైభవంగా నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించి లోకక్షేమం, ప్రజల సుఖశాంతులు, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు భక్తి గీతాలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం ఆలయ నిర్వాహకులు విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా గోశాల కమిటీ సభ్యులు భక్తులందరికీ అల్పాహారం ఏర్పాటు చేశారు. గో సంరక్షణ, భారతీయ సంస్కృతి పరిరక్షణలో గోశాలలు కీలక పాత్ర పోషిస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతానికి రాజేశం, ముకుంద్‌లాల్, మనోహర్, రాజగోపాల్ తదితరులు సహకరించగా, స్థానిక భక్తులు, మహిళలు, గోభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోయిగూడ ప్రభుత్వ స్కూల్ లో కాంగ్రెస్ నేతల పండ్ల పంపిణీ



**సికింద్రాబాద్,జూలై 31 ( ప్రజామంటలు) :** కాంగ్రెస్ పార్టీ జాతీయ సీనియర్ నాయకులు, రాజ్యసభ సభ్యులు పవన్ ఖేరా జన్మదిన వేడుకలు బన్సీలాల్‌పేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు వి.ఎస్. నారాయణ పాండుగౌడ్ ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట్ పరిధిలోని న్యూ బోయగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు,కేకులు, ఫ్రూటీలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జి.ఎల్. రమేష్ బాబు, సీనియర్ నాయకురాలు అనిత, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆరతి రోషన్లతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న కస్తూరి సంతోష్

10 గ్రాముల బంగారం యజమానికి అప్పగింత



**మల్లాపూర్ / జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) జూలై 31 :** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన ఘటన చోటుచేసుకుంది. మండలానికి చెందిన కస్తూరి సంతోష్ తన కిరాణా దుకాణంలో లభించిన సుమారు 10 గ్రాముల బంగారాన్ని అసలు యజమానికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు.వెంపెల్లి - వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తోట పెద్దరాజారెడ్డి కస్తూరి సంతోష్ కిరాణా దుకాణానికి వచ్చిన సమయంలో సుమారు 10 గ్రాముల బంగారం అక్కడే పొరపాటున మిగిలిపోయింది. బంగారం తన వద్ద ఉన్న విషయాన్ని గుర్తించిన సంతోష్, వెంటనే పెద్దరాజారెడ్డికి ఫోన్ చేసి సమాచారం అందించి, దుకాణానికి పిలిపించారు. అనంతరం బంగారాన్ని ఎలాంటి స్వార్థం లేకుండా ఆయనకు అప్పగించారు.ఈ రోజుల్లో విలువైన బంగారం పోయిన తర్వాత తిరిగి దొరకడం చాలా అరుదని, అలాంటి పరిస్థితుల్లో కస్తూరి సంతోష్ చూపిన నిజాయితీ అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. నిజాయితీగా వ్యవహరించి బంగారాన్ని యజమానికి అప్పగించిన సంతోష్‌ను పలువురు గ్రామస్తులు అభినందించారు. సమాజంలో ఇలాంటి నిజాయితీపరులు ఉండటం చాలా అరుదని వారు హర్షం వ్యక్తం చేశారు.


# అమ్మవారి ఘటానికి బోయగూడలో ఘనస్వాగతం

పాల్గొన్న బిజెపి నేత మర్రి పురురవ రెడ్డి



**సికింద్రాబాద్, జూలై 31 (ప్రజా మంటలు) :** లష్కర్ బోనాల జాతరను పురస్కరించుకుని న్యూ బోయిగూడలో శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఘటానికి స్థానికులు అంగరంగ వైభవంగా స్వాగతం పలికారు. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు ఆలయానికి వచ్చి దర్శించుకోలేని పరిస్థితిని గుర్తించి, నిర్వాహకులు అమ్మవారి ఘటాన్ని వీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా న్యూ బోయిగూడకు చేరుకున్న అమ్మవారి ఘటానికి స్థానికులు స్వాగత తోరణాలతో ఘన స్వాగతం పలికారు. ఈ వేడుకల్లో బిజెపి యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా, నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించి పూజా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్తంభం పెల్లి పెద్ద చెరువును పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్



**ధర్మపురి / జగిత్యాల జిల్లా ప్రతినిధి, (ప్రజా మంటలు) జూలై 31 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామంలోని పెద్ద చెరువు భారీ వర్షాలకు ప్రమాద అంచనా ఉండడంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. డిప్యూటీ ఈఈ చక్రు నాయక్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కట్ట తెగకుండా చేయవలసిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వారి వెంట ఆర్డిఓ మధుసూదన్, చెక్కుల నాయక్, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎస్సై, గ్రామ సర్పంచ్, వెల్గటూర్ మాజీ సర్పంచ్, స్థానిక గ్రామస్తులు వెలుగటూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పొలం పనులు చేస్తుండగా రైతుకు గుండెపోటు -- మృతి



**ఎల్కతుర్తి జులై 31 ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామంలో గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొమ్మనవేన సమ్మయ్య (60) అనే రైతు సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు.సమ్మయ్య అపస్మారక స్థితిలో పడిపోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న 108 సిబ్బంది సీపీఆర్ నిర్వహించి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.సమ్మయ్య మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## వర్షానికి కూలిన ఇళ్లు - పరామర్శించిన జీవన్ రెడ్డి



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) జూలై 31 :** జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామంలో అధిక వర్షానికి రవి ఇల్లు కూలిపోవడం జరిగింది. ఆ ఇంటిని శుక్రవారం మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి పరిశీలించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. అధికారులతో ఫోన్ లో మాట్లాడి సంఘటన స్థలాన్ని పరిశీలించి రిపోర్ట్ చేయాలని సూచించారు.బాధిత కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.వారి వెంట యువజన నాయకుడు తాటిపర్తి సికె రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరన్ రావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, రాధకిషన్, రాజిరెడ్డి వెంకటేష్ గౌడ్, విష్ణు, సతీష్, శేఖర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎల్ నీనో ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదిక ప్రభుత్వానికి అందజేత



**హైదరాబాద్, జూలై 31 (ప్రజా మంటలు) :** రాష్ట్రంలో ఎల్ నీనో పరిస్థితుల ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేసి రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణి, హార్టికల్చర్ కమిషనర్ యాస్మిన్ బాషాలకు ఈ నివేదికను అందించారు.ఈ సందర్భంగా నివేదికలోని ప్రధాన అంశాలు, సిఫార్సులను డాక్టర్ చిన్నారెడ్డి అధికారులకు వివరించారు. ఎల్ నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వ్యవసాయం, నీటిపారుదల, తాగునీటి నిర్వహణ, ఉద్యానవనం, విద్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేసేలా నివేదికలో సూచించిన సిఫార్సులను శాఖల వారీగా పగడ్బందీగా అమలు చేయాలని ఆయన కోరారు.కాగా, ఈ నిపుణుల కమిటీ రూపొందించిన నివేదికను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి కూడా డాక్టర్ జీ. చిన్నారెడ్డి అందజేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఎల్ నీనో పరిస్థితుల వల్ల ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే దిశగా ఈ నివేదిక మార్గదర్శకంగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం రాష్ట్రానికి తీరని లోటు

గొడిసెల రాజేశం గౌడ్



**హైదరాబాద్, జూలై 31 (ప్రజా మంటలు) :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మరణం పట్ల మాజీ సీనియర్ మంత్రి, మాజీ తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గొడిసెల రాజేశం గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “పెద్ది సుదర్శన్ రెడ్డి గారు ప్రజల సమస్యల పరిష్కారానికి జీవితాంతం అంకితభావంతో పనిచేసిన ప్రజానాయకుడు. ప్రజలతో మమేకమై, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన ఆకస్మిక మరణం నర్సంపేట ప్రాంతానికే కాకుండా తెలంగాణ రాష్ట్ర రాజకీయ రంగానికి తీరని లోటు” అని పేర్కొన్నారు.ప్రజాసేవలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని, ప్రజల హృదయాల్లో ఆయనకు ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని రాజేశం గౌడ్ అన్నారు.ఈ విషాద సమయంలో భగవంతుడు పెద్ది సుదర్శన్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తున్నానని, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారికి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ ప్రజలు పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని గొడిసెల రాజేశం గౌడ్ పేర్కొన్నారు.

# సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మట్టి బోనం

డాక్టర్ జీవీ వెన్నెల



**సికింద్రాబాద్,జూలై 31 ( ప్రజామంటలు) :** ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దివ్య ఆశీస్సులతోనే 19వ శతాబ్దంలో విరుచుకుపడిన ప్లేగు, కాలరా వంటి మహమ్మారి అంటు వ్యాధులు నిర్మూలన అయ్యాయని, ప్రజలకు అమ్మవారే కొండంత అండగా నిలిచారని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ జీవీ వెన్నెల పేర్కొన్నారు. శుక్రవారం బన్సీలాల్‌పేట్‌లోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భక్తుల ముక్కోటి కోరికలను తీర్చే గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుచుకునే తెలంగాణ బోనాల పండుగ ప్రపంచంలోనే అత్యంత గొప్ప ఆధ్యాత్మిక వేడుక అని కొనియాడారు.రాష్ట్రంలోని 32 జిల్లాలకు చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి విభాగంలో పనిచేస్తున్న 175 మంది మహిళా కళాకారులతో కలిసి ఆదివారం శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి వైభవంగా మట్టి బోనం సమర్పించనున్నట్లు డాక్టర్ వెన్నెల వెల్లడించారు. సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో జరగనున్న ఈ విశేష బోనాల మహోత్సవానికి పలువురు రాష్ట్ర మంత్రులు కూడా హాజరవుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా అభివృద్ధి చెందాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ గత ఏడాది నుంచి సారథి కళాకారులందరం కలిసి మహంకాళి అమ్మవారికి బోనాలు చెల్లిస్తున్నామని వివరించారు.సాంస్కృతిక సారథికి చెందిన పలువురు మహిళా కళాకారులు కూడా పాల్గొన్నారు.

# గోదావరికి పోటెత్తిన వరద

**పోలవరం స్పిల్ వే నుంచి రెండు లక్షల క్యూసెక్కులు**

**తెలంగాణ నుంచి భారీగా వస్తున్న వరద**

**అప్రమత్తమైన అధికారులు**

**మరో 15 అడుగులు పెరిగితే మొదటి ప్రమాద హెచ్చరిక**



ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పోటెత్తుతోంది. నిన్నటి వరకు ఇసుక మేటలతో కనిపించిన గోదావరి నేడు నిండుగా నీటితో కనువిందు చేస్తోంది. 'ఎల్ నినో' ప్రభావం వల్ల భారీ వర్షాలు లేదా వరదలు ఉండకపోవచ్చని భావించిన అధికార యంత్రాంగం, ఇప్పుడు అప్రమత్తమైంది. బుధవారం మధ్యాహ్నం వరకు తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి నది నీటి మట్టం సాధారణ స్థాయి అయిన 16 అడుగుల వద్ద ఉండగా, గురువారం ఉదయం 6 గంటల సమయానికి అది 25.40 అడుగులకు పెరిగింది. మధ్యాహ్నానికి నీటి మట్టం 28.60 అడుగులకు చేరగా, దిగువకు 3,94,633 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. నీటి మట్టం మరో 15 అడుగులు పెరిగితే, 43 అడుగుల వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం, ఎగువ తెలంగాణ ప్రాంతంలోని జయశంకర్ భూపాలపల్లి, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో దాదాపు 60 సెం.మీ వర్షపాతం నమోదైంది. అంతేకాకుండా, ఛత్తీస్‌గఢ్‌లో కురిసిన వర్షాల వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టు నిండిపోవడంతో, దిగువకు నీటిని విడుదల చేయడానికి 24 గేట్లను ఎత్తాల్సి వచ్చింది. ఈ అదనపు నీటి చేరిక కారణంగా గోదావరిలో వరద ఉధృతి ఊహించని విధంగా పెరిగింది. ఇది వరప్రసాదంగా మారుతుందా సాధారణంగా జూలైలో వరదలు వస్తుంటాయి. అయితే, ఈ ఏడాది జూలై చివరి వరకు గోదావరిలో నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉంది. బుధవారం రాత్రి నుంచి మొదలైన ఈ ఊహించని వరద ఉధృతి ఒక శుభపరిణామం. ప్రస్తుతం నమోదైన 28.60 అడుగుల నీటి మట్టం ఈ ఏడాదిలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక వరద ప్రవాహం కావడం గమనార్హం. స్పిల్‌వే నుంచి 2,00,000 క్యూసెక్కుల నీటి విడుదల పోలవరం స్పిల్ వే వద్ద 29.25 మీటర్లకు చేరిన నీరు : గురువారం సాయంత్రానికి పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటి మట్టం 29.25 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 2,00,000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. రాబోయే రెండు రోజుల్లో ఎగువ ప్రాంతం నుంచి 5,00,000 నుంచి 6,00,000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఇదే సమయంలో, పట్టిసీమ ఎత్తిపోతల పథకంలోని 20 పంపుల ద్వారా ప్రాజెక్టు కుడి కాలువలోకి 7,080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి నది మధ్యలో పట్టిసీమ వద్ద ఉన్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ కొండ పాదభాగంలోని మెట్ల వరకు వరద నీరు చేరింది.

# హైదరాబాద్‌లో వినాయక విగ్రహాల ఎత్తుపై పోలీసుల ఆంక్షలు

**గతేడాది జరిగిన ప్రమాదాల నేపథ్యంలో తయారీదారులకు సీపీ సజ్జనార్ సూచనలు**

**విగ్రహాల ఎత్తు 16 అడుగులకు మించొద్దన్న సజ్జనార్**

**మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించాలని కళాకారులకు పిలుపు**

**విగ్రహాల తరలింపునకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల ఏర్పాటు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సైబరాబాద్ పోలీసులు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. గత ఏడాది నిమజ్జనం సమయంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి విగ్రహాల ఎత్తు 16 అడుగులకు మించరాదని సీపీ వీసీ సజ్జనార్ విగ్రహ తయారీదారులకు స్పష్టం చేశారు. గురువారం బంజారాహిల్స్‌లోని కమిషనరేట్‌లో విగ్రహాల తయారీదారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ, గతేడాది కమిషనరేట్ పరిధిలో సుమారు 23 వేల విగ్రహాలను ప్రతిష్ఠించారని, వాటి రవాణా సమయంలో నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. ఈసారి అటువంటి పొరపాట్లకు తావివ్వకుండా భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ధూల్‌పేట్, జల్పల్లి, మైలార్‌దేవ్‌పల్లి వంటి ప్రాంతాల నుంచి విగ్రహాలను నగరంలోకి తరలించేందుకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. కళాకారులు సామాజిక బాధ్యతతో మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించాలని, భక్తులు కూడా సులభంగా నిమజ్జనం చేసే చిన్న విగ్రహాలను ఎంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విగ్రహాల లోడింగ్, అన్‌లోడింగ్ కోసం వాడే క్రేన్లు, రవాణా వాహనాలకు తప్పనిసరిగా సర్టిఫికేషన్ ఉండాలని, అనుభవజ్ఞులైన సిబ్బందితోనే వాటిని నడపాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం

**మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**

**భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జా**

**భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం**

**నీటి మట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందన్న అధికారులు**



ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద గోదావరి నదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ ఉదయం 8 గంటలకు 40.2 అడుగులకు చేరిన గోదావరి, 10 గంటల వరకు 43 అడుగులకు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదల వల్ల నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శబరి నది ప్రవాహంతో గోదావరికి పోటు గోదావరి నీటి మట్టం పెరగడంతో స్నాన ఘాట్ ప్రాంతం వద్ద చాలా మెట్లు, విద్యుత్ స్తంభాలు వరద నీటిలో మునిగాయి. కల్యాణ కట్ట వరకు వరద నీరు చేరింది. గోదావరి దిగువన ఉన్న శబరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శబరి పోటు ఉండటం వల్ల దిగువ ప్రాంతానికి వెళ్లే నీరు నెమ్మదిగా ప్రవహిస్తోంది. ఫలితంగా భద్రాచలం వద్ద వరద నీరు పెరుగుతోంది.భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి తెలంగాణలోని పలు జలశయాల్లో నీటి మట్టాలు ఇలా

ఎస్సారెస్పీ ప్రాజెక్టు :

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 74,950 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీరాంసాగర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటినిల్వ 21.7 టీఎంసీలు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 1,069 అడుగులు

నిజాం సాగర్ ప్రాజెక్టు :

కామారెడ్డి: నిజాంసాగర్ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 4,530 క్యూసెక్కులు నిజాంసాగర్ పూర్తిస్థాయి సామర్థ్యం 17.8 టీఎంసీలు నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటినిల్వ 7.8 టీఎంసీలు

ఎల్లంపల్లి ప్రాజెక్టు :ఎ

పెద్దపల్లి జిల్లా : ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 4.49 లక్షల క్యూసెక్కులు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 30 గేట్లు ఎత్తిన అధికారులు ఎల్లంపల్లి ప్రాజెక్టు మొత్తం ఔట్‌ఫ్లో 4,64,645 క్యూసెక్కులు ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వ 19.64 టీఎంసీలు ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 20.17 టీఎంసీలు

జూరాల ప్రాజెక్టు

జూరాల జలాశయానికి ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కులు జూరాల ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 318.51 మీటర్లు జూరాల ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 317.59 మీటర్లు జూరాల ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ 9.65 టీఎంసీలు జూరాల ప్రాజెక్టు ప్రస్తుత నీటినిల్వ 7.81 టీఎంసీలు జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కులు విడుదల

భూపాలపల్లి:

కాళేశ్వరం త్రివేణి సంగమంలో జలకళ కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద 9.93 మీటర్లకు చేరిన నీటిమట్టం ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదుల ఉధృతి సాధారణ, సరస్వతి పుష్కరఘాట్ మెట్ల పైనుంచి ప్రవహిస్తున్న నదులు

# లిక్కర్ స్కామ్‌లో కీలక పరిణామం

**లొంగిపోతానంటూ సైఫ్ పిటిషన్**

**మద్యం కుంభకోణంలో కీలక నిందితుడు సైఫ్ అహ్మద్**

**లొంగుబాటు యత్నం**

**లంచాల వసూళ్లు, డొల్ల కంపెనీల ఏర్పాటులో కీలకపాత్రధారి**

**లొంగిపోయేందుకు అనుమతించాలని విజయవాడ ఏసీబీ**

**కోర్టులో వ్యాజ్యం**



వైఎస్సార్సీపీ హయాం నాటి మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు సైఫ్ అహ్మద్ లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఏసీబీ కోర్టులో లొంగుబాటుకు పిటిషన్ వేశారు. కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశించిన కోర్టు తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసింది. మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తును దారి మళ్లించటంలో సైఫ్ ప్రధాన పాత్ర పోషించారనే ఆరోపణలున్నాయి. 2024 ఆగస్టు 9న దుబాయ్‌కు పరారీ: వైఎస్సార్సీపీ హయాం నాటి మద్యం కుంభకోణం ముఠాలో కీలక సభ్యుడు 10గా ఉన్న షేక్ సైఫ్ అహ్మద్ విజయవాడలోని ఏసీబీ కోర్టులో లొంగుబాటు పిటిషన్ దాఖలు చేశారు. మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి లంచాల వసూళ్లలో ఇతను కీలకమనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024 ఆగస్టు 9న సైఫ్ అహ్మద్ దుబాయ్ పారిపోయారు. గతేడాది మేలో సిట్ అధికారులు సైఫ్ అహ్మద్‌పై లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. కేసులో మిగతా నిందితులు అంతా పట్టుబడటం, స్వదేశానికి తిరిగొస్తే తన అరెస్టు తప్పదని భావించిన సైఫ్ అహ్మద్ మరో గత్యంతరం లేకే లొంగిపోతున్నట్లు సిట్ అధికారులు భావిస్తున్నారు. మద్యం విక్రయాల లెక్కలన్నీ అతని దగ్గరే శ్రీకాళహస్తికి చెందిన సైఫ్ అహ్మద్ మద్యం కుంభకోణంలో కీలక నిందితులైన రాజ్ కెసిరెడ్డి, ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి ఏజెంట్‌గా వ్యవహరించారు. వైఎస్సార్సీపీ హయాంలో బెవరేజెస్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా పనిచేసిన సత్యప్రసాద్ డేటా ఎంట్రీ ఆపరేటర్ అనూషతో నిత్యం సంప్రదింపుల్లో ఉండేవారు. వీరిద్దరూ మద్యం విక్రయాల డేటాను రాజ్ కెసిరెడ్డి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు సైఫ్‌కు చేరవేసేవారు. దాని ఆధారంగా ఏపీ డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ఎంతెంత లంచాలు వసూలు చేయాలో లెక్కలు కట్టి రాజ్ కెసిరెడ్డికి పంపించేవారు. రాజ్ కెసిరెడ్డి అలా వసూలు చేసిన లంచాల సొమ్మును దారి మళ్లించేందుకు ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పెద్ద ఎత్తున డొల్ల కంపెనీలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ, బోగస్ పత్రాలు, బిల్లుల సృష్టి, నగదు అక్రమ రవాణాలో సైఫ్ కీలకంగా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం కుంభకోణం మూలాలు వెలికి తీస్తుండటంతో రాజ్ కెసిరెడ్డి, ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ముందు జాగ్రత్త చర్యగా సైఫ్ అహ్మద్‌ను దుబాయ్ పంపించేశారు.

## తెలంగాణ ఉద్యమంలో పెద్ది పాత్ర చిరస్మరణీయం

**సుదర్శన్ రెడ్డికి సీఎం రేవంత్ సహా ప్రముఖుల నివాళులు**

**పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

**తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర చిరస్మరణీయమన్న సీఎం**

**సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ముఖ్యమంత్రి**



నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని సీఎం పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.సుదర్శన్ రెడ్డి భౌతికంగా మనందరి నుంచి దూరం అవ్వడం ఆవేదన కలిగిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్?రెడ్డి అన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజా జీవితంలో సుదర్శన్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేసిన నాయకుడిగా పేరు నిలిచిపోతుందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల మంత్రి తుమ్మల సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.

## ఏలూరులో రిలయన్స్ రూ.లక్ష కోట్ల భారీ ప్రాజెక్ట్

**దేశంలోనే మొదటిది ఇదే**

**చింతలపూడి, రేచెర్ల బొగ్గు గనులను దక్కించుకున్న రిలయన్స్ సంస్థ**

**భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు**

**2029 నాటికి ప్రాజెక్టు సాకారం**




ఏలూరు జిల్లా చింతలపూడి, రేచెర్ల బొగ్గు గనుల దశ మారనుంది. కేంద్ర బొగ్గుశాఖ ఇటీవల నిర్వహించిన ఇ-వేలంలో ఈ రెండు బొగ్గు గనులను "రిలయన్స్" సంస్థ దక్కించుకుంది. ఇక్కడ సుమారు రూ.లక్ష కోట్ల భారీ పెట్టుబడితో దేశంలోనే మొట్టమొదటిసారిగా అత్యంత ప్రతిష్టాత్మకమైన "భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్" ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసేందుకు సంస్థ సిద్ధమైంది. రిలయన్స్ ప్రతినిధులు 2 రోజుల కిందట సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. ప్రాజెక్ట్ వివరాలు, కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఈ ప్రాజెక్టు సాకారమైతే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభించనుందని అంచనా. దేశంలోనే తొలి ప్రాజెక్ట్: చింతలపూడి, రేచెర్ల బ్లాకుల్లో ఉపరితలం నుంచి కనీసం 600 మీటర్లు, అంతకంటే దిగువకు వెళ్లే కొద్దీ అపారమైన బొగ్గు నిక్షేపాలు లభిస్తాయి. ఇంత లోతు నుంచి బొగ్గును వెలికితీయడం భారీ వ్యయంతో కూడుకున్న పని కావడంతో, సాంప్రదాయ తవ్వకాలకు బదులుగా అత్యాధునిక గ్యాసిఫికేషన్ సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నారు. బొగ్గును భూమి లోపలే వాయువు (గ్యాస్) రూపంలోకి మార్చి పైకి తెచ్చే ఈ వినూత్న అండర్ గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టు దేశంలోనే మొదటిది కావడం విశేషం. 2029 నాటికి ఈ ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రిలయన్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

# పెద్ది ఇక లేరు

**నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కన్నుమూతదనర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత .గురువారం అర్ధరాత్రి 12.51 గంటలకు తుది శ్వాస ప్రకటించిన సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు. సాయంత్రం స్వగ్రామం నల్లబెల్లిలో అంత్యక్రియలు**



తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్?ఎస్మాజీ ఎమ్మెల్యే (నర్సంపేట) పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూశారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల 51 నిమిషాలకు తుది శ్వాస విడిచినట్లు యశోద ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. పెద్ది మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బీఆర్?ఎస్ నేతలు ఆయన భౌతిక కాయానికి ఆస్పత్రిలో నివాళి అర్పించారు. స్వగ్రామం నల్లబెల్లిలో ఇవాళ పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియలు జరగనున్నాయి.హనుమకొండకు పెద్ది భౌతిక కాయం 'పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు' అనే వార్త బీఆర్ ఎస్‌శ్రేణుల గుండె బరువెక్కిస్తుంది. ఈ నెల 26న ఉదయం హనుమకొండలో ఆయనకు ఛాతీలో నొప్పి రావటంతో స్థానికంగా రోహిణి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కార్డియాక్ అరెస్ట్‌గా గుర్తించారు. గంట సేపు శ్రమించి తొమ్మిదిసార్లు సీపీఆర్ చేశాక కొంత ఫలితం కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. 5 రోజులు మృత్యువుతో పోరాడిన పెద్ది సుదర్శన్ రెడ్డి శుక్రవారం కన్నుమూశారు. పెద్ది మరణంతో ఆయన కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు ఆస్పత్రికి చేరుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. పెద్ది భౌతిక కాయాన్ని హనుమకొండకు తరలించారు. సుదర్శన్‌రెడ్డికి భార్య స్వప్న, పిల్లలు నిదర్శన్‌రెడ్డి, ధర్మిష్ట ఉన్నారు. అంచెలంచెలుగా ఎదిగిన పెద్ది 1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లిలో రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్ రెడ్డి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన, 2014లో నర్సంపేట నుంచి బీఆర్ఎస్‌తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకుంటానని ప్రతిజ్ఞ చేసి రాష్ట్రం సిద్ధించిన తరువాతే 2017లో లక్ష్మీ ప్రసన్న(స్వప్న)ను వివాహమాడారు. 2016లో తెలంగాణ సివిల్ సప్లయ్స్‌కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేశారు. 2018లో నర్సంపేట నుంచి బీఆర్ఎస్‌ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవి చూశారు. పెద్ది అంత్యక్రియలు ఈరోజు సాయంత్రం ఆయన స్వగ్రామం నల్లబెల్లిలో నిర్వహించనున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com